సామాజిక బస్సుయాత్ర విజయవంతం

- భారీగా తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు
- శింగనమల నుంచి బుక్కరాయసముద్రం వరకూ సాగిన యాత్ర



బుక్కరాయసముద్రంలో జరిగిన సామాజిక సాధికార బహిరంగ సభకు హాజరైన అశేష జనం

శింగనమల: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతమైంది. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో గురువారం శింగనమలలో ప్రారంభమైన కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి భారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, మంత్రులు గుమ్మనూరు జయరాం, ఉషశ్రీ చరణ్, ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, బాపట్ల ఎంపీ నందిగాం సురేష్, ఎమ్మెల్యేలు కాపు రామచంద్రారెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, దుద్దేకుంట శ్రీధర్‌రెడ్డి, సిద్దారెడ్డి హాజరయ్యారు. ముందుగా వారు అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ విలేకరుల సమావేశంలో ప్రసంగించి, నియోజకవర్గంలో జరిగిన నాడు–నేడు పనులపై ఏర్పాటు చేసిన ఫొటోలను పరిశీలించారు. శింగనమలలో సాయంత్రం 4 గంటలకు బస్సు యాత్ర ప్రారంభమైంది. డీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించాయి. బస్సు టాప్‌పై ఎమ్మెల్యేలు, మంత్రులు నిలబడి అందరికీ అభివాదం చేసుకుంటూ వచ్చారు. రోటరీపురంలో ప్రజలు రోడ్డు మీదకు భారీగా తరలివచ్చి బస్సుపై పూల వర్షం కురిపించారు. కార్యక్రమంలో ఎంపీపీ యోగేశ్వరి, మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ భూమిరెడ్డి సునీతమ్మ, వైస్ ఎంపీపీలు విజయ, నరసింహులు, గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ నరసయ్య, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్వీ నారాయణ, మండల కన్వీనర్ నగేష్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవులు పాల్గొన్నారు.

భారీ జనసందోహం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం నిర్వహించిన సామాజిక సాధికార బహిరంగ సభ జన సందోహంతో నిండిపోయింది. విచిత్ర వేష ధారణలో కళాకారులు సీఎం వైఎస్ జగన్ పాటలకు డ్యాన్స్‌లు చేస్తూ అలరించారు. డప్పు కళాకారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి, మండల కన్వీనర్ అంకే నరేష్, వైస్‌ఎంపీపీ రామగోపాల్, ఎంపీటీసీలు కాలువ వెంకటలక్ష్మి, సుజాత, శిరీజ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



బస్సుపై నుంచి ప్రజలకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు







బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం, బస్సుయాత్రలో పాల్గొన్న పామిడి వీరా,ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, వైవీఆర్



మరగాళ్ల ప్రదర్శన



నృత్యం చేస్తున్న కీలుగుర్రం కళాకారులు



బహిరంగ సభకు హాజరైన వృద్ధురాలి ఆనందం

క్లుప్తంగా

ఘనంగా వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట



ఎమ్మెల్యే వైవీఆర్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

గుంతకల్లు రూరల్: ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి సహకారంతో కసాపురంలో నిర్మించిన వాల్మీకి మహర్షి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వాల్మీకి విగ్రహం వద్ద పూజలు చేశారు. గ్రామ వాల్మీకి సంఘం సభ్యులు, ఇతర గ్రామస్తుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వైవీఆర్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా చిప్పగిరి జెడ్పీటీసీ విరుపాక్షి, కిసాన్‌సెల్ జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ తిక్కస్వామి, వాల్మీకి సంఘం నాయకులు గంతుల రామాంజనేయులు, గంతుల లక్ష్మన్న, గంతుల శ్రీనివాసులు, అంజి, వైఎస్సార్‌సీపీ నేతలు సుధాకర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక రైలులో మట్టి తరలింపు



మట్టిని వలంటీర్‌కు అందజేస్తున్న ఎంపీడీఓ విజయభాస్కర్

గార్లదిన్నె: నాభూమి– నా దేశంలో భాగంగా మండల వ్యాప్తంగా సేకరించిన మట్టిని ఢిల్లీకి పంపుతున్నట్లు ఎంపీడీఓ విజయభాస్కర్ పేర్కొన్నారు. గురువారం ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో సేకరించిన మట్టిని కలశంగా తయారు చేసి గ్రామ వలంటీర్ వేణుగోపాల్‌కు అందజేశారు. శుక్రవారం మధ్యాహ్నం 1 గంటకు ధర్మవరం నుంచి బయలుదేరే ప్రత్యేక రైల్లో గ్రామ వలంటీర్ మట్టిని ఢిల్లీకి తీసుకెళ్తారన్నారు. కార్యాలయ సిబ్బంది, ఉపాధి సిబ్బంది వలంటీర్‌ను అభినందించారు.

ప్రభుత్వ స్థలాలు పరిరక్షించాలి

గుంతకల్లు రూరల్: ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని కోరుతూ సీపీఎం నాయకులు గురువారం తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సీపీఎం నేత బీ.శ్రీనివాసులు మాట్లాడుతూ పట్టణంలో ప్రభుత్వ భూములు క్రమంగా అన్యాక్రాంతం అవుతూ వస్తున్నాయన్నారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.

పంటకోత ప్రయోగాలు



పంట కోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ వెంకట్రాముడు

పెద్దవడుగూరు : జి.వెంకటాంపల్లిలో గురువారం ఏడీఏ వెంకట్రాముడు ఆధ్వర్యంలో వేరుశనగ పంటలో పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు గంగాదేవి అనే రైతు పొలంలో నిర్ణీత విస్తీర్ణంలో పంట తొలగించగా 1.125 గ్రాములు, వెంకటలక్ష్మమ్మ పొలంలో 0.975 గ్రాములు దిగుబడి వచ్చింది. పంట దిగుబడిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ రజిని, సునీత, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం పగిడిరాయి గ్రామానికి చెందిన చిన్న రంగన్న అనే వ్యక్తి గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితికి చేరుకున్న చిన్న రంగన్నను కుటుంబ సభ్యులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

ఆర్టీసీ డోర్ డెలివరీ సేవలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న డీఎం నారాయణస్వామి

గుంతకల్లుటౌన్: ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ నారాయణస్వామి కోరారు. గురువారం డిపోలో డోర్ డెలివరీ సేవలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. డీఎం మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాలకు ఆర్టీసీ డోర్ డెలివరీ సదుపాయం అందుబాటులో ఉందన్నారు. 50 కేజీల బరువు వరకు బుకింగ్ చేసిన పార్సిల్, కొరియర్స్‌ను ఇంటి వద్దకే చేరుస్తామన్నారు. పార్సిల్ కేంద్రం నుంచి 10 కి.మీ పరిధిలో డోర్ డెలివరీ సదుపాయాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా మహబూబ్ సుబహాని గంధం



జెండా కట్ట వద్ద ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుత్తి రూరల్ : రజాపురం గ్రామంలో మహబూబ్ సుబహాని గంధం వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం గ్రామంలోని షేక్షావలి ఇంటి నుంచి గంధంను ఊరేగింపుగా తీసుకొని వచ్చి జెండా కట్ట వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే వై. వెంకట్రామిరెడ్డి జెండా కట్ట వద్ద మహబూబ్ సుబహాని సమాధికి పూలమాలలు వేసి, చాదర్ సమర్పించారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాతో సత్కరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు హాజీ మలంగ్ బాబా, కేశవులు, మదనరాజు, యోగేశ్వర నాయుడు, దాదా ఖలందర్, మహబూబ్ బాషా, కృష్ణ, మహాలింగ పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



వృద్ధురాలితో సమస్యలపై ఆరా తీస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

యాడికి: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువ నాయకుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం వెంగన్నపల్లెలో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు రావడం లేదని, మురుగు సమస్య ఉందని, గ్రామ కంఠంలో జగనన్న ఇళ్ల నిర్మాణానికి అవకాశం కల్పించాలని ఎస్సీకాలనీవాసులు ఆయనను కోరారు. కాలనీలో సమస్యలు పరిష్కరించాలని ఆయన పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్‌కు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామి రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు పుట్లూరు జయప్రద, నగరూరు సర్పంచు రుక్మాందరరెడ్డి, డీలర్ భాస్కర్ రెడ్డి, నాయకులు రాజారెడ్డి, నిరంజన్‌రెడ్డి, నాయక్, చలమారెడ్డి, దేవేంద్ర, లక్ష్మీరంగారెడ్డి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో భరోసా



మెడికల్ రిపోర్ట్‌ను అందజేస్తున్న కౌన్సిలర్ వెంకటలక్ష్మి, కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: పేదలకు ఆరోగ్య భరోసా కల్పించేందుకే సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, 22వ వార్డు కౌన్సిలర్ ఎస్.వెంకటలక్ష్మి తెలిపారు. గురువారం పట్టణంలోని మండీబజార్ వాటర్ ట్యాంక్ సచివాలయ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్పెషలిస్టు వైద్యులు ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అసిస్టెంట్ కమిషనర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దవప్పూరు: పెద్దయక్కలూరులో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యులు కళ్యాణ్ కుమార్, సౌజన్య, సాయి, తాగూర్ 356 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు.

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు సచివాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, చైర్ పర్సన్ వన్నూర్‌బీ, వైస్ చైర్ పర్సన్లు వరలక్ష్మి, పద్మలత కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్యులు రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు కౌన్సిలర్లు వరదరాజులు, రాజేశ్వరి, సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

యువత సేవాభావం అలవర్చుకోవాలి

గుంతకల్లుటౌన్: విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలని రోటరీక్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వి.సతీష్ సూచించారు. గురువారం రోటరీక్లబ్‌లె రొటరాక్ట్, ఇంటరాక్ట్ క్లబ్‌ల జిల్లా ప్రతినిధులు జి.వైష్ణవి, అభయ్‌నారాయణ ఆధ్వర్యంలో సర్వాభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిన్నవయస్సులోనే సేవాతత్పరతతో సేవాకార్యక్రమాలు నిర్వహించి ఆదర్శంగా నిలుస్తున్న 36 మంది యువతీ,యువకులకు, పలు క్లబ్‌లను అవార్డులు అందించారు. మాజీ ఏజీ జివి.లక్ష్మణ్, డీఆర్‌సీసీ వక్కల ఉమా, డీవీసీసీ బికె.నాగన్న, రోటరీ ఏజీ రహీమ్, జోనల్ కార్యదర్శి అనురాధ, రోటరీ క్లబ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, శివానంద తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుచ్చి ఉత్సవం

తాడిపత్రి అర్బన్: చింతల వెంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో బాగంగా గురువారం శ్రీదేవిభూదేవి సమేత మలయప్ప స్వామికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఉదయం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై స్వామి వారిని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో నిత్యార్చనలు, విశేష పూజలు, వేదపారాయణాలు, భజన సంకీర్తనలు జరిగాయి. అనంతరం పల్లకీపై గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పట్టణ వీధుల్లో ఈ ఉత్సవం జరగడంతో భక్తులు కర్పూర హారుతలు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి చింతల వెంకటరమణస్వామి హనుమద్ వాహనంపై విహరించారు. పట్టణ వీధుల్లో ప్రజలు స్వామి వారి ఊరేగింపు సందర్భంగా కళ్లాపి చల్లి రంగు రంగుల ముగ్గులు వేసి భక్తి శ్రద్దలతో స్వాగతం పలికారు.



హనుమద్ వాహనంపై ఊరేగుతున్న చింతలరాయుడు

ప్రజలు ఇబ్బందులు పడితే మాకేంటి?

- అభివృద్ధి పనులను అడ్డుకున్న టీడీపీ కౌన్సిలర్లు



పనులు నిలిపేయాలని రూరల్ ఎస్‌ఐ మహమ్మద్ గౌస్‌ను కోరుతున్న టీడీపీ కౌన్సిలర్లు



మురుగునీరు నిల్వ ఉన్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: పట్టణంలోని యల్లనూరు రోడ్డులో ఓపెన్ డ్రైనేజీ పూర్తిగా మురుగునీటితో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతుండటంతో పనులు చేసేందుకు వెళ్లిన కాంట్రాక్టర్‌ను పనులు చేయొద్దంటూ టీడీపీ కౌన్సిలర్లు అడ్డుకున్నారు. ప్రజలు ఇబ్బందులు పడితే మాకేంటి అనే రీతిలో వ్యవహరించడం విమర్శలకు దారితీసింది. వివరాలిలా ఉన్నాయి... యల్లనూరు రోడ్డులోని నేస్తం అపార్ట్‌మెంట్ సమీపంలో ఉన్న ఓపెన్ డ్రైనేజీ పూర్తిగా మురుగునీటితో నిండిపోయింది. అక్కడి బిందెల కాలనీలోని ఖాళీ స్థలాల్లో సైతం నీరు నిలిచిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ ప్రజలు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దృష్టికి తీసుకురావడంతో మురుగు నీరు వెళ్లేందుకు మార్గం సుగమం చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. దీంతో అతడు మున్సిపల్ కమిషనర్‌కు సమస్యను వివరించి ఓపెన్ డ్రైనేజీలోని మురుగు నీటిని అక్కడే ఉన్న అండర్ డ్రైనేజీ సంపులోకి మళ్లించే పనులను బుధవారం చేపట్టాడు. విషయం తెలుసుకున్న టీడీపీ కౌన్సిలర్లు ప్రజలకు మేలు జరగడమే కాక, ఎక్కడ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి మంచి పేరు వస్తుందోనన్న అసూయతో అప్పటికే మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి చొరవతో పబ్లిక్ హెల్త్ డీఎస్‌ఈ ఆదేశాలతో కూడిన పనుల రద్దు పత్రాన్ని తీసుకుని పనులను అడ్డుకున్నారు.

పనుల ప్రదేశాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

బిందెల కాలనీని గురువారం సాయంత్రం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పరిశీలించారు. అక్కడి పరిస్థితులను మున్సిపల్ అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. పనులు ఆగిపోయిన ప్రదేశానికి వెళ్లి చూశారు. అనంతరం జిల్లా కలెక్టర్ గౌతమితో ఫోన్‌లో మాట్లాడారు. ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రవి, ఇతర ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి మురుగు నీటి ఇబ్బందులు లేకుండా, శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు.

8న విద్యాసంస్థల బంద్

గుంతకల్లుటౌన్: కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం నవంబర్ 8న విద్యాసంస్థల బంద్ తలపెట్టినట్లు ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శులు పరమేష్, కుళ్లాయప్ప తెలిపారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, డీవైఎఫ్‌ఐ, ఏఐవైఎఫ్, విద్యార్థిసేన నాయకులు సమావేశం నిర్వహించారు. నవంబర్ 8న కేజీ నుంచి పీజీ వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల బంద్‌కు అందరూ సహకరించాలని వారు కోరారు. విద్యార్థిసేన అధ్యక్షుడు అబ్దుల్‌బాసిద్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్‌కుమార్, విద్యార్థి సంఘాల నాయకులు రమణయ్య, ఆనంద్, అఖిల్, వెంకట్‌నాయక్, వంశీ, సూరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీదేవి నిమజ్జనం

పామిడి: పట్టణంలో గురువారం వాసవీ మాతృ మండలి ఆధ్వర్యంలో గౌరీదేవి నిమజ్జనం ఘనంగా జరిగింది. మేళతాళాలతో అమ్మవారి కీర్తనాలాపనల నడుమ గౌరీదేవి ప్రతిమను ఊరేగించారు. ఎగువపల్లి హెచ్ఎల్‌సీలో నిమజ్జనం చేశారు.

రేపు రోజ్‌గార్ మేళా

గుంతకల్లు: రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు రోజ్‌గార్ మేళా ఏర్పాటు చేసినట్లు సీనియర్ డీసీఎం మనోజ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా 74 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యువతకు సందేశం అందించి ఈమెయిల్ ద్వారా ఉద్యోగ ఆర్డర్లను అందజేస్తారని తెలిపారు. గుంతకల్లులో జరిగే కార్యక్రమానికి కేంద్ర మంత్రి సిరిపాడ్ నాయక్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

జోగినులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

గుంతకల్లు రూరల్: జోగినులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు నాగలక్ష్మి గురువారం తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి విన్నవించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో దాదాపు 50 మంది జోగినుల కుటుంబాలు ఉన్నాయన్నారు. ఎన్నో ఏళ్లుగా వీరికి సొంతిళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో సర్వే నెంబర్ 25లో తమకు పట్టాలు మంజూరు చేసిన ఇంతవరకూ స్థలాలు చూపించలేదన్నారు. అనంతరం పూలమాల, శాలువాతో తహసీల్దార్‌ను సత్కరించారు.